నీవు కాదు!

[కథానిక]

= శ్రీ మొదలి వెంకటరామయ్య =

కరతాళధ్వనులమధ్య అగ్రాసనాధిపతి కామేశం గారు లేచినుంచొని కంఠం సవరించుకున్నారు.

"అయ్యా! కామేశంగారు మాట్లాడుతూన్నారు. దయచేసి నిశ్శబ్దంగాఉండ ప్రార్థిస్తున్నాను." అని కార్యదర్శి సభాసదులకు మనవిచేసుకున్నాడు. సభలో గుసగుసలు అణిగాయి.

కామేశంగారు అందుకుని-

"మహాశయులారా! యిక్కడ యీ రోజు మన మందరం యెందుకు సమావేశమయామో లోగడ మాట్లాడిన పెద్దమనుషులు విపులంగా తెలియజేశారు. కాబట్టి నేను చెప్పవలసింది యెక్కువ లేదు. సుప్రసిద్ధ సంఘసేవకులు, మిత్రులు, యీపురవాసులు అయిన శ్రీమూర్తిగారి అకాలమరణం మన పట్టణానికి, యీ పట్టణంలోని అనేక సంస్థలకు తీఱని కొఱత గలిగించింది. మనపురంలో హరిజనహాస్టలు, జాతీయపాఠశాల, సేవాసంఘము మొదలైన సంస్థలు స్థాపింపబడి ముందుకొస్తున్నాయంటే అది కీర్తిశేషులైన మూర్తిగారి స్వార్థరహితమైన కృషిఫలితమే! ఆ సంఘసేవకుడు తన సర్వస్వాన్నీ యీ సంస్థల అభివృద్ధికోసం అర్పించాడు. పైపెచ్చు ఋణంకూడా చేసి వానిని సక్రమ మార్గంలో నడిపించడానికి పాటుపడ్డాడు. యీసంస్థలు యెంత ప్రశంసనీయంగా పనిచేస్తున్నాయో, యెంతమంది అనాథలకు ఆసాక్షరాన్ని కలిగించాయో అనేది చూస్తే ఆయనకృషిని ప్రశంసించనివారుండరు. అలాంటి సంఘసేవకుడు, నిష్కల్మష చిత్తుడు, ఉత్తమమిత్రుడు మనపట్టణాన్ని అంధకారంలో ముంచి అస్తమించాడు. నామట్టుకు నేను అలాంటి మిత్రుణ్ణి ఇక సంపాదించలేను. ఆయన చేసిన మహత్కార్యాలు గర్వించదగ్గవి.

"కాని ఒక్కవిషయం మీరంతా గమనించాలి. మనపట్టణానికి పేరుతెచ్చిన ఆవ్యక్తికి మనం చేయదగ్గ సహాయం ఒకటి ఉంది. ఆయన తనసర్వస్వాన్నీ సంఘసేవకు అర్పించి-పైగా ఋణంకూడా చేసి పోయాడు. ఇది ఆయనను నిందించడం గాదు. సత్కార్యాలకే వినియోగించాడుగాని దుబారాయేమీ చెయ్యలేదు. ప్రస్తుతం ఆయనభార్య, ఏకైక పుత్రిక జీవనం జరగక చాలా యిబ్బందిపడుతూన్నారు. ఒక యకరామాగాణీ, ఒక పూరిల్లూ యివి ఉన్నాయి. కాని వాటికి తగిన అప్పుంది. పైగా అమ్మాయి వివాహానికి యెదిగివుంది. మనకు అపారసేవ చేసిన ఆ మిత్రుని కుటుంబాన్ని ఋణవిముక్తంచేసి వాళ్లకు జీవనోపాధికల్పించడమే యీసమయంలోమనము చూపవలసిన సానుభూతి! ఊరికే సానుభూతిసభ జరిపి లాభంలేదు. క్రియాపూర్వక మవాలి! అప్పుడే పరలోకంలో ఉన్న ఆయనఆత్మకు నిజమైన శాంతి లభిస్తుంది. మనం కృతకృత్యుల మవుతాము. ఆయన చూపిన త్యాగానికి మనం కృతజ్ఞత చూపకపోతే మన పట్టణం అధఃపతిత మవుతుం దన్నమాట."

అని ఒకే గుక్కలో ఆవేశంతో చెప్పి కూర్చున్నారు.

సభలోంచి "హియర్! హియర్!" (వినుడు, వినుడు) అనే ప్రశంసావాక్యాలు వినిపించాయి.

౨

ఉదయం యెనిమిదిగంట లవుతుంది. రంగమ్మ వెనకా ముందూ చూచుకుంటూ గేటు దాటి వరండాలో కొచ్చింది. తన కాళ్లు రాచుకుని ఆ పాలగచ్చు ఎక్కడ పాడైపోతుందో నని భయపడుతూ, అడుగులు వేస్తూ గడిప్రక్కను నుంచోని సందేహంతో లోపలికి తొంగి చూచింది. తలవంచుకుని కాగితాలు చూచుకుంటూన్న కామేశంగారు బుర్ర పైకెత్తారు. గది గుమ్మంలో నీడ కనిపించింది.

"ఎవరు వారు?" అన్నాడాయన.

"నేనండీ బాబుగారూ! రంగమ్మను. తమ కేదో పనుందని దాసీచేత కబురంపిస్తే ఒచ్చానండి!" అంది రంగమ్మ.

"లోపలికిరండి! మీతో ఒకవిషయం మాట్లాడాలి"

ఆమె బెదురుచూపుల్తో లోపలి కెళ్లి తలుపు దగ్గిరసా గోడ కానుకుని నుంచుంది.

మీరు దిగుల్లోఉంటారని యిన్నాళ్లనుంచీ మీతో నేను ప్రస్తాపన చేయలేదు. ఇప్పుడు అవసరమైంది. కాబట్టి మిమ్మల్ని పిలిపించాను. మూర్తిగారు నాకు రాసిచ్చిన దస్తావేజుసంగతి మీకు తెలుసా?" అన్నాడు కఠినంగా.

" తెలుసండీ బాబుగారూ!"

"ఒట్టి దస్తావేజు కాదుసుమా! మీకు ప్రస్తుతమున్న యకరా మాగాణి, ఇల్లూగూడా నాకు తనఖా పెట్టాడు. రిజస్టరీ గూడా అయింది. యిదుగో కాగితం!" అంటూ డ్రాయర్లోని కాగితం బయటికి తీసి చూపాడు.

రంగమ్మ నిలువునా నీరయింది. నోట మాటరాలేదు. ఇదివరకల్లా ఒట్టి నోటేమో ననుకుంది. మాగాణి, యిల్లూగూడా తనఖాపెట్టా రనేసరికి ఆమెముఖంలో కత్తివాటు వేసినా నెత్తురుచుక్క లేకుండా పోయింది. ఇంకేముంది? అంతా పూర్తిఅయింది! తనకూ, సరోజకూ యిక గతేమిటి? యీ ఆలోచనలతో ఆమెకు మాటపెగల్లేదు. అతికష్టంమీద—

"ఒట్టి ప్రాంసరీనో టనుకున్నానండీ!" అంది.

"యీకాలంలో ప్రాంసరీనోటుమీద వెయ్యి రూపాయలు అప్పెవరిస్తారమ్మా వెర్రిదానా!" అన్నారు నిరాదరసూచక మందహాసంతో కామేశంగారు.

"మొత్తం యెంతయిందండీ బాబుగారూ!"

"యీ రోజుకు సరిగా పదిహేను వందలయింది. ఎంతైతేనేమి! నీ వేమిచ్చి తీర్చుకుంటావు పాపం! ఇంతకూ నీ దురదృష్టం. మణిపూసలాంటి భర్తను సంపాయించావు. మహాసంఘసేవకుడు! ఆస్తినీ, ఆఖరుకు పెళ్లాంపుస్తెనూగూడా ఆ పాడు సంస్థల కివ్వకపోతే యేంమునిగిపోయింది? కడకు అ వేమన్నా ఉద్ధరించాయా? చచ్చేదాకా వాటిని బట్టుకుని దేవుల్లాడి మీకుమాత్రం గతిలేకుండా చేశాడు. ఆహాహా! ఏంప్రయోజకుడు! 'మూర్తిగారు చాలా గొప్పవారు. పాపం! పోయారు! వారి కుటుంబానికి మాసానుభూతి!' అని అందరూ అనగానే మీ కేం కడుపు నిండింది? ఇంతకూ ఆ ప్రశంసించేవాళ్లల్లో మీకు దమ్మిడీ సహాయంజేసే వాళ్లను చూపండి! ఎందుకొచ్చిందీ లేనిపోని అవిధి? సంఘాలంటూ లేవదీసి వాటిద్వారా నాలుగుడబ్బులు సంపాయించి బాగుపడడం తెలివిగాని, యిలా దివాలాగావడ మేం తెలివి? ఎంతమంది లేరు ప్రపంచంలో, యీయన ఒక్కడేనా సంఘాన్ని ఉద్ధరించేది? చివరకు కట్టుకున్న భార్యకూ, కడుపున పుట్టిన కూతురికీ ఆసాకారం లేకుండా చేసిపోయాడు. గొప్ప సంఘసేవ!" అని తన కసినంతా వెళ్లగక్కేశారు కామేశంగారు.

రంగమ్మకు కళ్లనీళ్లపర్యంత మయింది. తాను దైవసమునిగా జూచుకుని, ఆయన సత్కార్యాలే చేశాడని తాను నమ్మిన తన భర్తను ఆయన స్నేహితుడే, తనయెదటనే యీవిధంగా తిట్టిపోస్తాడని కల్లోగూడా అనుకోలేదు. ఆ వాక్శూలాలకు ఆమెహృదయం గాయపడింది. బ్రదికివున్నకాలంలో స్నేహం, చచ్చింతర్వాత తిట్లు! ఏమిప్రపంచం! ఏమో సహాయం చేయడానికి పిలిపించా డనుకుని గంపెడాశతో, ఎన్నడూ ఒకర్ని యాచించిగాని, భర్త గతించినప్పటినుంచి గుమ్మందాటిగాని యెరగని తాను అభిమానాన్ని చంపుకుని యిల్లువెదుక్కుంటూ వస్తే ఇదీ ఆయ నిచ్చిన సంభావన!

"అయ్యో! అలా అంటా రేమండీ! వారికి మీరంటే ప్రాణం. యీనాడు మీనోటంటనే యీ మాటలు వింటూంటే నాకు చాలా కష్టంగా వుంది. వారేం పొరబాటుచేశారు? అనాథలకు తన ధనాన్నీ, శరీరాన్నీ అర్పించారు; హరిజనవిద్యార్థులకు హాస్టలు కట్టించారు; దిక్కులేని బీదలకు రాట్నాలు కొని యిచ్చి జీవనోపాయం చూపారు. యివి చెడ్డపనులాండి? వారు దుబారాచేసిం దేమీ లేదు. మీ రలా అనవచ్చునా?"

"ఆహా! అద్భుతకార్యాలు చేశాడు! నే నంటే ప్రాణం గాబట్టే నన్ను నిలువునా ముంచేశాడు. అందువల్ల వారి కీర్తి ఆచంద్రార్కం నిలుస్తుంది! నీవు మంచి అంటుంటే నే నెందుకు కాదనాలి? నిన్ను చూచేసరికి జాలి కలిగి అలా అన్నానుగాని మధ్య నాకెందు కీగొడవ! అన్నట్టు మరిచిపోయాను. నా దస్తావేజు మాటేమిటి మరి?"

"నేను ఆడదాన్ని యేం జేయగలను బాబుగారూ! మా పరిస్థితులు మీకు తెలుసుగా! మీదయ ఉంటే యింత సంకటి తింటూ ఆనీడపట్టున పడి ఉంటాము. అదీగాక పిల్ల పెండ్లికి యెదిగివుంది. ఏ అయ్యచేతులోనన్నా పెట్టవలసిం దొకటుంది. మా జీవనం జరగాలి! యివన్నీ తమరు ఆలోచించండి! మాగాణీ, యిల్లూ మీరు తీసుకుంటే యిక మాకు దిక్కేమిటి? యే చెట్టుకిందనో అడుక్కుతింటూ అల్లాడవలసిందేగదూ! తర్వాత మీ అనుగ్రహం!"

"యీ వేషాలన్నీ నాముందర సాగవు! కొంప గుల్ల జేసుకోమని నేనేమైనా చెప్పానా? ఎవరి ఖర్మం వాళ్లనుభవించాలి! మీసోదంతా నాముందు వెళ్లబోసుకుంటే యేం లాభం? ఊళ్లో అందర్నీ అడుక్కుతినేవాళ్లను రక్షించడానికి నేనా కర్తను?"

"నే నలా అన్నానాండీ! తమ దయ అని అడుగుతున్నాను"

"మధ్య నాదయేమిటి? ఓవేపు కంతరొక్కం వెయ్యిరూపాయలు పోగొట్టుకుని నేనేడుస్తూంటే ఇంకా దయేమిటి? ఆరోజు యెలాగో బుద్ధిపుట్టింది గాబట్టి తనఖా పెట్టించుకున్నాను. లేకుంటే నోట్లో వేలేసుకో వలసిందేగదూ!"

"యిప్పుడుమాత్రం నేను బాకీ అబద్ధ మంటున్నానాండీ?"

"పైగా అబద్ధమనాలి గాబోలు రిజస్టరీ అయిన దస్తావేజునుగూడా! బాగుంది వరస! మీకోస మని నాడబ్బు పోగొట్టుకుంటానా? నాకూ పిల్లా జెల్లా వున్నారు. ఉన్నది లోకుల కిచ్చి సన్యాసినై పోవాలని గాబోలు మీవూహ!"

"అంతమాట లెందుకండీ! తమరు మహారాజులు! యీ పదిహేనువందలూ తమకు యెక్కడ రావడం లేదు? అందుకని ప్రాధేయపడుతూన్నాను. మమ్మల్ని కరుణించి ఋణవిముక్తులను చేస్తే ఇంత గంజితాగి బతుకుతాము"

"మహారాజునే! ఇదేం మేరుపర్వతమా? ఇలా అందరికీ తోసేస్తూంటే చివరకు నేను మిగుల్తాను. మీయిష్టం ! దమ్మిడీ గూడా పోనిచ్చేది లేదు. నా కష్టార్జితం! సంసారమంతా లోకులకు కొల్లబెట్టి నా మీద బడి యేడుస్తా రేమిటి ? మొదటనే భర్తను దిద్దుకోలేకపోయావా అంత అభిమానం గల యిల్లాలివైతే? దేనికైనా దూరదృష్టి అవసరం గాదూ ! ఆయనకు అనుకూలంగా నీవూ తాళం వేస్తూంటే ఇదీ చివరకు

తేలింది! నా తప్పేమిటి? నీ కెలా నోరొచ్చిందమ్మా నన్ను నష్టపొమ్మని చెప్పడానికి? ఒకటా రెండా? పదిహేను వందలు! అయ్యయ్యో! నాకు మతిపోతోంది! రేపే దావా పడేయ్యబోతున్నాను. మర్యాదగా అయిల్లూ, మాగాణీ ఒదిలేసి వెడితే మంచిది. లేకుంటే బోలెడంత గ్రంథం జరుగుతుంది! బాగా ఆలోచించుకోండి! మీతో వాదించడానికి నాకు టైము లేదు!" అంటూ కామేశంగారు కండువా వేసుకుని వరండాలో కొచ్చారు. వారి వెనకాలే రంగమ్మకూడా బయటికొచ్చింది.

సంతత ధారగా కన్నీరు కారుతూంది రంగమ్మకు! ప్రపంచమంతా శూన్యంగా కనిపించింది. ఆ ఉండేది కాస్తా వూడితే తనూ, సరోజా యేంగావాలి? దిక్కు లేని పక్షి అయింది. ఏం జేస్తుంది? ఆదుకునేవా ళ్లెవరూ లేరు!

తటాలున కామేశంగారి రెండు పాదాలూ పట్టుకుంది వెక్కి వెక్కి యేడుస్తూ-

"బాబుగారూ! అన్నం పెట్టినా మీరే; చంపినా మీరే! ఆడదాన్ని! భిక్షం పెట్టండి!" అంటూ అతని పాదాలను అశ్రువులతో తడిపింది. అది ఉక్కు గుండె! కరుగుతుందా?

కామేశంగారు వికటంగా నవ్వుతూ పాదాలను యివతలకు లాక్కుని—

"ఎక్కడ నేర్చావమ్మా యీ టక్కులు? కడకు యిదే మాంచి ప్రయోగ మనుకున్నావు గాబోలు! నీ యేడుపులకు నేనేమీ చలించననుకో! మా యింట్లో యాడవడ మేమిటి? నీ భర్తను తలుచుకుని మీ యింట్లో కూచుని బాగా యేడు! నా బాకీ మాత్రం వసూలై తీరవలసిందే!" అని గర్జించి గబగబా గేటుదాటి పోయాడు!

స్తంభించిన కన్నీటితో రంగమ్మ ఆయన పోయిన వేపే శూన్యంలోకి చూస్తూ నుంచుంది!

3

"రంగమ్మగారూ! యిలా రండి!" అనే మృదుస్వరం వినిపించింది. రంగమ్మ బాహ్యప్రపంచంలో కొచ్చింది. పమిటచెంగుతో ముఖం తుడుచుకుని నలువైపులా దృష్టి ప్రసరింపజేసి "ఎవరో!" అనుకుంది. యిక ఆ యింట్లో అరక్షణంగూడా నిలవడానికి మనస్కొప్పక, ముందుకు అడుగులేస్తూ "ఇకముందు ఆత్మహత్యే గదా గతి!" అనుకుంది. వెంటనే సరోజ సంగతి జ్ఞాపకం రాగానే కన్ను చెమ్మగిలింది.

"మిమ్మల్నే! యిలా రండి!" అని మళ్లీ అదే కంఠస్వరం.

వెనుదిరిగి చూచింది. వరండా ప్రక్కగది కిటికీలోంచి ఒకముఖం కనిపించింది. "ఆమే! విశాలాక్షమ్మ! కామేశంగారి భార్య!" అని మనసులో అనుకొని, "ఆయన అన్న మాటలు చాలక యీమె గూడా యింకా యేమో అనదలుచుకుంది గాబోలు!" అనే భయంతో తల గిరుక్కున తిప్పుకుంది.

"పిలుస్తూంటే వెడతా వేమిటి?" అంది మళ్లీ విశాలాక్షమ్మ.

"ఎందుకు తల్లీ! సగం చచ్చిపోయాను. పూర్తిగా చంప దలుచుకున్నారా!" అనే సరికే ఆమె కంఠం రుద్ధ మయింది.

"అయ్యో! మిమ్మల నేమీ అనడానికి గాదు. ఒక్కమాట వినిపొండని పిలుస్తున్నా! అంతే! యిలా లోపలికి రండి!" అంది విశాలాక్షమ్మ నొచ్చుకుని.

విధిలేక వెనక్కు తిరిగింది రంగమ్మ. ఆమెను లోపల గదిలోకి తీసి కెళ్లి కూచోమని తానుకూడా యెదురూగా కూచుంది విశాలాక్షమ్మ. రంగమ్మ ఉబికి వచ్చే అశ్రువులను మాటిమాటికీ అడ్డుబెట్టుకుంటూంది.

"అలా యిదవకండి! నేనుగూడా వారంటూన్నది యావత్తూ వింటూనే వున్నా. నేనేమో యింకా అంటానని మీరు బెదరనవసరంలేదు. నేనూ ఆడదాన్నే! నాకూ హృదయ ముంది! మిమ్మల్నన్న మాటలకూ, మీరున్న స్థితికీ నాకు కళ్ల నీళ్లొచ్చాయి." అంది విశాలాక్షమ్మ జాలిగా కండ్లు తుడుచుకుంటూ.

"అసహాయ నని అలా అనడం ధర్మమేనాండి!"

"అన్ని ఆలోచిస్తారా ఆయన? ఆ స్వభావమే అంత! ఆమాటలన్నీ మీరు మరిచిపోవాలి. ఆయన సహాయంచేయకపోయినా నేనున్నాగా! మీకేం ఫరవాలేదు!"

ఆశ్చర్యమైంది రంగమ్మకు. అమృతం వర్షించినట్లైంది. "ఆయనమాటలకూ, యీమెమాటలకూ యింత తేడా వుందేమిటి? ఆయనే ఆవిధంగా తృణీకరించినప్పుడు యీావిడేం సహాయం చేస్తుంది?" అనే తర్కంలో పడ్డది రంగమ్మ.

"ఏమిటో ఆలోచిస్తున్నారల్లే ఉంది?"

"ఏముంది? ముందుగతి ఎలాగా అని."

"మీ కాచింత అవసరంలేదు. మీరూ, మూర్తిగారూ ఆదర్శదంపతులు. నాకు మీరంటే చాలా అభిమానం. మీరిద్దరూ కలిసి సంఘసేవకు మీసర్వస్వమూ అర్పించారు. అనేకులు అనాథలను అభివృద్ధిలోకి తెచ్చారు. ఆయన చేసిన త్యాగంలో, సాధించిన మహత్కార్యాల్లో మీకుగూడా వాటా వుంది. మీకు యేమీ మిగల్చ లేదని మీరు ఆయన్ని నిందించక పోవడం మీలోని గొప్ప సుగుణం. యీ డబ్బేం శాశ్వతమా? ఒక్క మంచిపేరే భూమ్మీద నిల్చేది. మీ దంపతులు అది సంపాదించగలిగేరు! మీరు ధన్యులు."

ఆమాటలు వింటూంటే రంగమ్మహృదయం ఉప్పొంగింది. అనుకోని ఆదరణ ఆమెలో నూతనోత్సాహం కలిగించింది. "నిజంగా విశాలాక్షమ్మ యింత మంచిదా?" అనుకుంది. కాని కామేశంగారి మాటలు యింకా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. "ఏం ధన్యులం లెండి! ఇంతవరకూ ఎవరివల్లా మాటపడి యెరగను. చివరకు ఆయనగూడా యేసందర్భంలోనూ పల్లెత్తు మాట అనిన పాపాన బోలేదు. ఈరోజు..."

"అదేగా మొదట చెప్పాను మరిచిపొండని! ఆయనకు డబ్బంటే ప్రాణం. ఇందాకానే నేను మాట్లాడుదా మంటే వీలులేకపోయింది. మీఋణం తీర్చందీ ఆయన ఒదలడు!"

"కానీండి! మాప్రాప్తం!" అంది నిస్పృహతో రంగమ్మ.

"అలా అని వూరుకుంటే? అందుకనే మీకు సహాయంచేయమని భగవంతుడు నన్ను పురికొల్పుతున్నాడు. వారు చేయలేకపోయినా నేను చేయడానికి పూనుకున్నాను."

"సహాయమా? ఎలా చేస్తారు? వారు ఒప్పుకోందే?"

"వారి అంగీకారంతో అవసరంలేదు! ఉండండి యిప్పుడే వస్తాను!" అంటూ లోపలి కెళ్లింది విశాలాక్షమ్మ.

రంగమ్మ కేమీ బోధపడక యిదేదో యింద్రజాల మనుకుంది. కాని అంత ఆప్యాయంగా మాట్లాడి ద్రోహం చేస్తుందా అని సమర్థించుకుంది. పర్యవసానం చూడాలని ఆమెవూహ!

ఒక చిన్న పెట్టె చేత్తోపట్టుకుని వచ్చి కూర్చుంది విశాలాక్షమ్మ. బాగా పరీక్షిస్తూంది గాని రంగమ్మకు ఆమెఅభిప్రాయ మేమీ తెలీలేదు.

"దస్తావేజుమొత్త మెంతన్నారూ?"

"ఆసంగతిప్పు డెందుకు లెండి!"

"అలా కాదు. మీరు చెప్పితీరాలి!" అంది విశాలాక్షమ్మ ఆజ్ఞాసూచకంగా.

"పదిహేనువందలండీ!"

పెట్టెతెరిచి ఒక నోట్లకట్ట బయిటికి తీసింది. జాగ్రత్తగా లెక్కపెట్టి పదిహేనూ తీసి మిగిలినవి పెట్టెలో పెట్టింది. పదిహేను వందరూపాయలనోట్లు! రంగమ్మ తెల్లబోయి చూస్తూంది. ఆమెకు విశాలాక్షమ్మ అభిప్రాయ మేమిటో బోధపడలేదు.

"ఇవిగో పదిహేనువందల రూపాయలు. ఇవి వారికిచ్చి మీఋణం తీర్చుకోండి!" అంటూ విశాలాక్షమ్మ మందహాసంతో నోట్లను అందించింది. రంగమ్మ యీప్రపంచంలో లేదు. అనుకోని సంఘటన!

"మీరనేది నాకు బోధపడడం లేదు!"

"అలా అంటా రేమిటి? మిమ్మల్ని ఋణవిముక్తులను జేయడమే నాసంకల్పం. మీరేమీ అనుకోవద్దు! కొన్నాళ్లు చీకటి, కొన్నాళ్లు వెన్నెల! మీరూ, సరోజా పడే కష్టాలకు నాహృదయం బాధపడుతోంది. సంఘసేవకు మీసొత్తు అర్పించారుగాని మరేం దుబారా చేయలేదు! హృదయం లేనివా రెవ్వరైనా అంటారు! మీరు కలవరపడగూడదు! ఇవిగో తీసికోండి!" అంది.

అభిమానం వెనక్కు లాగింది రంగమ్మను.

"మీ రివ్వడం, నేను తీసుకోవడం లోకం హర్షిస్తుందా? కామేశంగారికి తెలిస్తే ... అయ్యో ఎందుకండీ మధ్య మీకు కష్టం? నన్ను పోనివ్వండి!" అని రంగమ్మ లేవబోయింది. విశాలాక్షమ్మ ఆమె చేయి పట్టుకుని కూచోబెట్టి—

"అడుగడుక్కూ మీరు మార్గంజేస్తే యెలాగా? మీరు నా అభిప్రాయం గ్రహించలేనందుకు నాకు చాలావిచారంగా ఉంది. ఇది నాడబ్బు! మాపుట్టింటివారిచ్చారు సొమ్ము చేయించుకోమని. ఇందులో ఆయనది చిల్లిగవ్వగూడా లేదు. నాడబ్బు నేను మీ కిస్తున్నాను. లోకానికి దీంతో యేమీ సంబంధం లేదు. మీరు తీసుకోకపోతే చెడ్డబట్టు!" అంటూ రంగమ్మ చేతుల్లో పెట్టింది నోట్లను.

దీనదృక్కులతో ఆమెవేపు చూచింది రంగమ్మ.

బయటినుంచి "అమ్మా" అని కేక వినిపించింది. "మీసరోజగాబోలు!" అంటూ విశాలాక్షమ్మ లేచి వెళ్లి "రా! సరోజా!" అని చెయిబట్టుకొని వచ్చి తన ప్రక్కను కూచోబెట్టుకుంది.

పోతబోసిన బంగారుబొమ్మ. కమ్మని కనుముక్కుతీరు. ఆడాళ్లకుగూడ మోహాన్ని కలిగించే రూపం.

తల్లి చేతులోని నోట్లను చూచి "అవెక్కడివమ్మా!" అంది ఆ అమ్మాయి ఆశ్చర్యంతో.

"విశాలాక్షమ్మగారి దయ తల్లీ!" అంది రంగమ్మ కృతజ్ఞతాపూర్వక దృక్కులతో. సరోజ యేమో మాట్లాడబోయింది.

"మీసరోజ కెన్నో యేడండీ రంగమ్మగారూ!"

"మొన్న పుష్యమాసానికి పధ్నాలుగూ వెళ్లాయి. కన్నతండ్రికి కరువైంది. దానిసంగతి తల్చుకుంటే కడుపు చెరువవుతుంది. ఏఅయ్యచేతులో పెడదామనుకున్నా మాస్థితి యిలా వుంది. దాని ముందుగతేమో!" అని వేడినిట్టూర్పు విడిచింది రంగమ్మ. తల్లిదిగులుచూచి సరోజకూడా ఒక కన్నీటిబొట్టు రాల్చింది.

"అలా మీరు దిగులుపడుతూంటే ఎలా బేజారై పోతోందో చూడండీ అమ్మాయి! తప్పమ్మా సరోజా! దిగులుపడవచ్చా? నీకు మంచిమొగుడొస్తాడులే!" అని బుగ్గ నిమిరింది విశాలాక్షమ్మ. ఆదుఃఖంలో ఒక సంతోషపులల.

"అలాంటి అదృష్టమా! మీ నోటివాక్యాన" అంది రంగమ్మ గుండెబరువుతో.

"యీ చక్కనిచుక్క పెండ్లి కేమండీ! మరి నేనొక మాటంటాను మీకు సమ్మతమేనా?" అంది నవ్వుతూ విశాలాక్షమ్మ.

"ఏమిటో!"

"ఏంలేదు. మా సత్యాని కిచ్చి చెయ్యరాదూ! ఏం సరోజా! మాసత్యాన్ని చేసుకుంటావూ?"

సరోజ సిగ్గుతో చిరునవ్వు నవ్వి తలవంచుకుంది. రంగమ్మ ముఖం విప్పారిందిగాని వెంటనే ముడుచుకుపోయింది.

"మీరు మహారాజులు! మీకూ మాకూ ఏం సాటి?"

"అలా అంటా రేమిటి? మహారాజు లైతే బంగారం తింటారా? ఇంతకూ మీసంప్రదాయం మంచిది. మీసరోజ అందమైంది. అంచేతే మిమ్మల్ని అడుగుతూన్నాను."

"పరిహాసాని కంటున్నా రేమో!"

"నా కేకోశానా అలాంటిది లేదు. నిజంగా అంటున్నా! సరోజను మీ రిచ్చితీరాలి!" అంది స్థిర దృష్టితో విశాలాక్షమ్మ.

"మీరు అంతగా కావాలంటూంటే నేను కాదంటానా ? ఇదే నిజమైతే మాఅమ్మాయి అదృష్టవంతురాలు. ఇంతకూ కామేశంగా రొప్పుకోవద్దూ!"

"ఇంకా మీకు సందేహమేనా? అదంతా నా భారం! మీరుమాత్రం మాటతప్పేరుసుమా! హాస్యం కాదు. ఇవే పెండ్లిమాట లనుకోండి!" అంటూ "అబ్బాయ్! సత్యం!" అని పిలిచింది.

పై అంతస్తులో శబ్దమయింది. మెట్లమీద జోడు చప్పుడు.

"అమ్మా! పిల్చావా?" అంటూ సత్యం గదిగుమ్మంలో నుంచున్నాడు. పందొమ్మి దేండ్లుంటాయి. బంగారంలాంటి శరీరచ్ఛాయ. యౌవనం శరీరంలోంచి తొంగిచూస్తోంది. అందం కరుడుగట్టి వుంది. అప్రయత్నంగా అతని చూపు సరోజమీద ప్రసరించింది. సరోజ అతని దృష్టిలో తన దృష్టి ఒకమారు మిళితం చేసింది. సిగ్గుతో ముఖం కందింది. తల ఒంచుకుంది. చిరునవ్వు సత్యంపెదవులమీద నాట్యంచేసింది.

"ఎందుకు పిల్చావమ్మా!" అన్నాడు సత్యం.

" పెండ్లికూతుర్ని చూచావా ? నీవు 'చేసుకుంటా'నని చెపితే ఆమె వినాలని కూచోనుంది."

"ఇదివరకే చెప్పాగా!"

"అలాకుదరదు. ఇప్పుడామె వినాలంటోంటే!"

"మళ్లీనా? చేసుకోవడం ఖాయమే ! " అని వెనక్కి తిరిగిపోయాడు.

"ఇదివరకే చెప్పా నంటా డేమిటి మీ అబ్బాయి?" అంది రంగమ్మ.

"అదేమిటో మీ సరోజనే అడగండి! " అని నవ్వుతూ, "మీకు తెలీదు గాబోలు! మావాడు మీయింటి ముందునుంచే కాలేజీకి వెడుతూంటాడట! ప్రతిరోజూ మీ సరోజ కనిపిస్తూంటుందిట! ఇద్దరి మనస్సులూ ఎప్పుడేకమయాయో! ఎన్ని సంబంధాలు వచ్చినా ఏదో సాకు బెట్టి తప్పించుకుంటూంటే నేనే మొన్న నిలవదీసి అడిగితే సరోజనుతప్ప యింకెవర్నీ చేసుకోనని పట్టుబట్టాడు. నాకూ సంతోషమయింది" అంటూ-

"అప్పుడే మా కుర్రాణ్ని వల్లో వేసుకున్నావా?" అని సరోజను ముద్దుపెట్టుకుంది.

రంగమ్మ ముగ్ధురాలై అలాగే చూస్తోంది.

౪

"ఎలా ఒచ్చింది చెప్మా యింతరొక్కం రంగమ్మకు! చిత్రంగా వుందే!" అంటూ లోపలి కొచ్చారు కామేశంగారు.

" చిత్ర మేమిటండీ !" అంటూ విశాలాక్షమ్మ యెదురుగా వొచ్చింది.

"నేను కల్లోగూడా అనుకోలేదు సుమా! రంగమ్మ పదిహేనువందలూ తెచ్చియిచ్చి తనఖా దస్తావేజు రద్దు రాయించి తీసికెళ్లింది. ఎక్కడిది ఆమె కంత డబ్బు?"

"ఆమెనే అడగలేకపోయారా?"

"అడిగాను. ఆమెదీనదశ చూచి జాలిపడి ఎవరో స్నేహితురాలు యిచ్చిందట! అంతమొత్త మెవరిస్తారేమిటి? ఆమెమాటలు నమ్మదగ్గవేనా?"

విశాలాక్షమ్మకు ఒళ్లుమండింది. ఆయనకర్కశ హృదయాన్ని బద్దలుగొట్టాలనే పట్టుదల ఆమెకు కలిగింది. ఉదయం మాట్లాడలేక పోయిందిగాని యిప్పుడు యెక్కడలేని ఆవేశం కలిగింది. ఏమైతే అవుతుందని సాహసించింది.

"మీదంటే జాతిగుండెగాని అందరివీ అలాగుంటాయా?"

"ఆఁ! ఏమిటే? నాది జాతిగుండే!"

"ముమ్మాటికీని! ఆమె అలా కాళ్లమీదపడి యేడుస్తూంటే జాతిగుండె కాకపోతే అన్నిమాటలూ అని నెట్టేసి వెళ్లిపోతారా? వింటూన్న నాకే కళ్లనీళ్లు గిర్రునతిరిగాయి."

"నిజమే! డబ్బెలా వస్తుంది మరి? వాళ్ల సంసారాన్ని నేనేమైనా చెరిచానా?"

"ఇంకేంగావాలి చెరచడానికి? కడకు ఆమె నేడిపించి పదిహేనువందలూ వసూలుచేస్తిరి! మొన్న సభలో యేమన్నారో జ్ఞాపకముందా? మూర్తిలాంటి వారు లేరనీ, వారు గొప్ప సంఘసేవకులనీ, అనేకసంస్థలు స్థాపించి పట్టణానికి కీర్తిసంపాయించారనీ ఏకంగా పొగిడారు. ఆయనకుటుంబానికి సహాయంచేయాలనీ, ఉద్ధరించాలనీ ఆవేశంతో యేమేమో చెప్పారు. అలాంటిమీరే యీరోజు ఆ దేశసేవకుని భార్య - అనాథ - వద్దనే చెవులుపిండి డబ్బు వసూలుచేశారు. యిదీ మీఉపన్యాససారం. యీమాత్రానికి అంతమంది జనంలో ఒట్టికబుర్లు చెప్పడ మెందుకూ? ఇలాగే ఉంటుంది ప్రపంచం. బ్రదికున్నన్నాళ్లూ చాలా మంచివాడనీ, సంఘసేవకుడనీ అంటూంటారు. చచ్చిన తర్వాత మొక్కుచెల్లించుకోవడానికి సానుభూతిసభ అంటూ జరిపి ఆవేశంతో ఏదో అర్థంలేకుండా మాట్లాడుతారు. క్రియ కొచ్చేసరికి ఆ కీర్తిశేషుని కుటుంబాన్ని తలుచుకునేవాళ్లుగూడా వుండరు. పైపెచ్చు ఆకుటుంబ నాశాన్నే కోరుతూంటారు కొందరు. అంచేతే సత్యానికీ, త్యాగానికీ ప్రపంచంలో తావే లేదు." అని ఆవేశంతో అంది.

కామేశంగారు కొయ్యబారిపోయారు.

"యీరోజు యేమి టీవరుస! ఆమె యిచ్చింది; నేను తీసుకున్నాను. మధ్య నీ దబాయిం పేమిటి? సభకు వెళ్లడం తప్పా? వాళ్లు గౌరవంగా అగ్రాసనాధిపత్యం యిస్తే దర్జాకోసం మూర్తిని గురించి యేవో రెండుముక్కలు చెప్పాను. అలా చెప్పకపోతే పరువేముంటుంది? చెపితేమటుకు అవన్నీ మన బాకీకి అన్వయిస్తా యనుకున్నావా?"

ఇంతలో ప్రక్కగదిలో చదువుకుంటూన్న సత్యం బయిటికొచ్చాడు.

"ఏమిటి నాన్నగారూ! ఆ అర్థంలేని మాటలు? మీరు చూపిన సానుభూ తేమిటి? మీరు చెప్పిన ముక్కలు మీరే జరపలేకుంటే ఎందుకూ అవి చెప్పడం? వారి కుటుంబాన్ని ఉద్ధరించాలని మీ రనలేదూ? కడ కిదీ ఉద్ధరించడం! ఎందుకండీ యీ పనికిమాలిన సభలు? స్వర్గంలో వున్న మూర్తిగారు మీచర్య జూచి యెంతగా దుఃఖిస్తున్నారో!"

"ఇద్దరూ ఏకమై నామీద యిలా విరుచుకు పడుతున్నారేమిటి? ఎవరికోసం నేను వసూలు చేసింది?"

ఆమె అందుకుని—

"ఆఁ! వసూలుచేశారు! మంచీ చెడ్డా గమనించవద్దూ? ఇప్పుడు బోలెడుందే! అది చాలకూ వాడికి? ఇంకా యెందర్ని యేడిపించి సంపాయించాలి? పోయేటప్పుడు మీరూ నేనూ నెత్తిన పెట్టుకు పోతామా? వాళ్లేకుస్తూ యిచ్చింది మన కేం అచ్చొస్తుంది? మొన్న ఆ రామదాసు మొత్తుకుంటూంటే వాడి యిల్లూ, వాకిలీ జప్తీచేయించి యాలంవేయిస్తిరి. ఆ అవధానిని బికారిని చేసి దేశాంతరం పంపిస్తిరి. యీదినం రంగమ్మ! యిదేం కొత్తా? ఉసూరుమనిపించి వాళ్లవద్ద తీసుకున్నది మన కేం శ్రేయస్సు నిస్తుంది? మనకు వుండేది ఆఒక్కడు. యెనిమిదికాన్పులకు యీనలుసు మిగిలాడు ఎవరినోటంట ఏమొస్తుందో అని నే నల్లాడుతున్నాను. కడుపుమ డినవాళ్లు ఏమైనా అంటారు. ఆ వుసురూ, ఘోషా మనకు కాదూ? బిడ్డలు గలవాళ్ల కంత కఠినం పనికిరాదు. రామ రామ! మీ రామెనన్న మాటలూ, మీపనులూ చూస్తూంటే భయ మేస్తోందిబాబూ! మీరు ఊరేగండి యీయింట్లో! నేనూ, వాడూ ఎక్కడైనా బతుకుతాము!" అని ఏకంగా విశాలాక్షమ్మ మొత్తని చీవాట్లు పెట్టింది.

కామేశంగారు నిర్విణ్ణులై—

"ఎందుకీ గొడవంతాను? నన్ను బ్రదకనివ్వవా యేమిటి? చాలించుదూ నీకు పుణ్యముంటుంది? ఎవరైనా వింటారు!"

"వింటే మునిగిపోయిం దేమిటి? యీరోజు మొదలు మీ రీవడ్డీవ్యాపారం మానేయాలి: తెలిసిందా? ఉన్నది చాలు!"

"సరే! నీయిష్టప్రకారమే! ఊరుకుందూ నన్ను చంపక!"

"వసూలుచేశారుగా రంగమ్మదగ్గిర! మాపుట్టింటివాళ్లిచ్చిందాంట్లో పదిహేనువందలూ నేనే ఆమెకిచ్చి చెల్లింపజేశా, తెలిసిందా? దాంట్లో మీది దమ్మిడీ లేదు! ఆమెఘోష చూడలేకపోయాను!"

"ఆఁ! నిజంగా నీవేనా యిచ్చింది?"

"అవును. నేనే. ఎందు కాశ్చర్యం? అదేగాదు! ఆమెకూతురు సరోజను సత్యానికి మాట్లాడాను. పెండ్లి ఖాయం."

"అదేమిటే? ఆ దరిద్రపుపిల్లనా? మనవాడికా? నేనున్నాననుకున్నావా, పోయాననుకున్నావా?"

"శుభమల్లే అలా అంటా రేమిటి? ఏం, నేను మాట్లాడగూడదూ! దరిద్రులం మనమే! పేరా ప్రతిష్ఠా? ఇంకా వాళ్లే సత్కార్యాలు చేసి పేరు సంపాయించారు. మనకంటే వాళ్లే మేలు."

"నాకు మతిపోతోంది! ఏమైనా మీయిష్టం! ఇల్లంతా నా కెదురుతిరిగింది. ఇంతకూ వాడు చేసుకుంటా నన్నాడా?"

"తప్పక. సంతోషపూర్వకంగా చేసుకుంటా నాన్నా! ఆపిల్ల మన యింటికి రావడం మన అదృష్టం! నీవూ అంగీకరించాలి!"

"పరిస్థితులు మారినప్పుడు తప్పుతుందా? ఒప్పుకున్నా నాయనా! నీవు ఒకయింటివాడవు కావడమే నాఅభిప్రాయం. సంతోషంతో ఆశీర్వదిస్తాను. వెనకటి పనులకు పశ్చాత్తాపపడుతున్నాను. దేవుడు క్షమిస్తాడో లేదో!" అంటూ కామేశంగారు ఒక అశ్రుకణాన్ని రాల్చారు.

* * *

సత్యానికీ, సరోజకూ అతివైభవంగా వివాహం జరిగింది. పెద్ద లందరూ వధూవరుల నాశీర్వదిస్తూ—

"కామేశంగారు నాడు సభలో అన్న మాటలను యథార్థంగా ఆచరణలో పెట్టి మూర్తిగారి కుటుంబాన్ని ఉద్ధరించారు! నిజంగా కామేశంగారు దీనబాంధవుడు" అన్నారు ఏకకంఠంతో.

"దీనబాంధవుణ్ణి నేనేనా?" అని సవితర్కంగా కామేశంగారు తన అంతరాత్మను ప్రశ్నించుకున్నారు.

"నీవు కాదు!" అని అతని అంతరాత్మ జవాబిచ్చింది!